క్లుప్తంగా

పూర్తయిన వంటగది నిర్మాణం



నిర్మించిన వంటగది

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద విద్యార్థులు పాఠశాలలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. గాదిగూడ మండలంలోని మేడిగూడ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో వసతులపై గత నెల 19న 'పాఠశాలలో వసతులు కరువు' కథనాన్ని సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో ఐటీడీఏ ఏఈ సునీల్ రాథోడ్ సదరు కాంట్రాక్టర్‌తో నెలరోజుల వ్యవధిలోనే వంట గది నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఆరుబయటే వంట చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు, భోజనం చేస్తున్న విద్యార్థులు వంటగది పూర్తి కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేసినందుకు 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. అభిమాన్యు వాట్సాప్ గ్రూప్ ద్వారా గతంలో నిరుపేద విద్యార్థులకు చదువు కోసం అందించిన సేవలకు ఫిదా అయిన యువత ఆదివాసీ నాయకుడు, సామాజిక కార్యకర్త మెస్రం శేఖర్ బాబు ఇచ్చిన మేరకు రక్తదానం చేసేందుకు సిద్ధం అవుతున్నారు. రక్తదాన శిబిరానికి రావాలని కలెక్టర్ రాజర్షిషాను ఆహ్వానించారు. నిర్వాహకులు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని కోరారు. ఝరి రాయిసెంటర్ సార్‌మేడి మందాడి దౌలత్ రావు, జంగుబాయి ఆలయ కమిటీ చైర్మన్ జాకూ, మాజీ జెడ్పీటీసీ మెస్రం సోము, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ గ్రామానికి చెందిన దాసరి శంకర్ అనారోగ్యంతో బాధపడుతూ.. ఇటీవల మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఖానాపూర్ నియోజకవర్గ భీం ఆర్మీ సంఘం నాయకులు సోమవారం మిలింద్‌నగర్ గ్రామానికి సందర్శించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. నెలకు సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ సందీప్, కాంబ్లే రాజేందర్, సూర్యవంశీ ఉత్తం, పరత్‌వాగ్ దత్త, కాంబ్లే అనిల్, కాంబ్లే కొండిబా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు



నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నార్నూర్: లగచర్ల రైతులకు రక్షణ కోసం ఢిల్లీ వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులను సోమవారం సీఐ రహీంపాషా మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫ్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, సయ్యద్ ఖాసింలు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌లో గిరిజనులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఫార్మాసిటీ పేరుతో అమాయక గిరిజన భూములను దౌర్జన్యంగా లాక్కోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ విష్ణు, మాజీ వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఫిరోజ్ ఖాన్, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

క్రికెట్‌తో ఉజ్వల భవిష్యత్



క్రికెటర్లతో జిల్లా గిరిజన క్రీడల అధికారి

ఆదిలాబాద్: నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటేనే క్రికెట్లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా గిరిజన క్రీడల అధికారి కొరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం క్రికెటర్లకు జెర్సీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ క్రీడకు దేశంలో ఎంతో ప్రాచుర్యం ఉందన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదగాలంటే ఎంతోమంది క్రికెటర్లతో పోటీ పడాల్సి ఉంటుందన్నారు. ఎన్నో నూతన మెలుకువలను పెంపొందించుకొని, నిత్యం సాధన చేస్తేనే క్రికెట్లో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల క్రికెటర్లు ఉన్నారని, వారు సరైన శిక్షకుల పర్యవేక్షణలో శిక్షణ పొందితే గొప్ప క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో సీనియర్ క్రికెటర్లు యూనుస్ అక్బాని, అతావుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ దందా..!



గుబిడి శివారులో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

- పెన్‌గంగ నుంచి జోరుగా రవాణా
- అందినకాడికి దండుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



గుబిడి శివారులో డంప్ చేసిన ఇసుక

తాంసి: జిల్లాకు సరిహద్దుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నుంచి నిత్యం ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రతీఏటా భూగర్భజలాలు అడుగంటడానికి కారణం అవుతున్నాయి. ఇసుకదందా యథేచ్ఛగా సాగుతున్న సంబంధిత శాఖల అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇసుక దందా జోరుగా సాగుతోంది. కూలీల, యంత్రాల ద్వారా తవ్వుతూ ట్రాక్టర్‌ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. అందినకాడికి దండుకుంటున్నారు. మండలంలోని గుబిడి, అంతర్గాం, వడూర్, తాంసి(కె) గ్రామాల శివారు పెన్‌గంగ నుంచి తవ్విన ఇసుకను మహారాష్ట్రతో పాటు జిల్లా కేంద్రానికి పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. అక్రమ రవాణాపై ఆయా గ్రామస్తులు అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినా.. అక్రమ దందా ఆగడం లేదు.

కొరవడిన సమన్వయం..

అక్రమ ఇసుక రవాణాపై ఏశాఖ చర్యలు తీసుకోవాలో అధికారులకే అంతుపట్టడం లేదు. రెవెన్యూ శాఖ అధికారులు మైనింగ్ శాఖదే అంటుంటే, మైనింగ్ శాఖది కాదు రెవెన్యూ అధికారులదేనని అంటున్నారు. ఇకా ఈ వ్యవహారంలో రెండు శాఖలు అక్రమ ఇసుక తవ్వకాలు, డంప్‌లు సీజ్ చేయడం, ఇసుకను తరలించే ట్రాక్టర్, టిప్పర్‌లాంటి వాహనాలను స్వాధీనం చేసుకున్నప్పుడే తమ పని అన్నట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. గుబిడిలో గ్రామంలో ఇసుక తవ్వకాలు అరికట్టాలని గ్రామస్తులు గత 15 రోజుల క్రితం తహసీల్దార్ కార్యాలయంలో రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలా ఎవరికీ వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరిస్తుండడంతో పెన్‌గంగ ఇసుక తవ్వకాలు నిరంతరాయంగా సాగుతున్నాయి.

మహారాష్ట్రకు తరలిస్తూ..

జిల్లాకు సరిహద్దుగా ఉన్న మహారాష్ట్రలో ఇసుకకు మంచి డిమాండ్ ఉండడంతో నదిలో తవ్విన ఇసుకను అక్రమార్కులు మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలో ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.8 వేల నుంచి రూ. 10 వేల వరకు పలుకుతుంది. పగలు కూలీల ద్వారా పెన్‌గంగ నదిలో నుంచి ఇసుకను తీసి గ్రామాల శివారులో నిల్వ చేస్తున్నారు. నిల్వ చేసిన ఇసుకను రాత్రి గుట్టు చప్పుడు కాకుండా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. గుబిడి శివారులో నిల్వ చేసిన ఇసుక నిల్వలను సైతం ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల చొప్పున మహారాష్ట్రకు చెందిన వ్యాపారులు నిల్వ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు

పెన్‌గంగ నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే మైనింగ్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటాం. పెన్‌గంగలో ఇసుక తవ్వకాలు, ఇసుక తరలిస్తే సమాచారం ఇవ్వాలి. నదిలో ఎక్కడ ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవు. ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధించడం జరుగుతుంది.

– నలందప్రియ, తహసీల్దార్, భీంపూర్

మహారాష్ట్రలో కూటమిదే అధికారం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిదే అధికారమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మహా రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా వార్ధా అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి పంకజ్ బోయర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ హయాంలోనే మహారాష్ట్రలో అభివృద్ధి జరిగిందన్నారు. వార్ధాలో ప్రజలు బీజేపీ వైపే ఉన్నారన్నారు. కాంగ్రెస్ చెందిన అభ్యర్థి రాజకీయ లబ్ధి పొందడానికి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని మండిపడ్డారు. అయితే ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలకు ప్రజలు మోసపోకుండా బీజేపీ కార్యకర్తలు వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. బీజేపీ కూటమితోనే ప్రగతి సాధ్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: బీసీల రిజర్వేషన్ల తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో బీసీల మనుగడకు ప్రమాదం పొంచి ఉందన్నారు. కమీషన్ల పేరిట కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు అక్షింతలు వేస్తే తాజాగా నవంబర్‌లో మరో డెడికేషన్ కమిషన్ వేశారని తెలిపారు. కమిషన్ సభ్యులు క్షేత్రస్థాయి పర్యటన చేసి సర్వే జరిపితే స్పష్టత వస్తుందన్నారు. బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు దాసరి రమేశ్, జగదీష్, అశోక్‌స్వామి, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

'న్యాయం జరిగేంత వరకు పోరాడుతాం'



ఆందోళన చేస్తున్న నాయకులు

నార్నూర్: వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని లగచర్ల గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ గాంధీ చౌక్ వద్ద వారికి మద్దతుగా ధర్నా చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల గ్రామానికి చెందిన లంబాడా గిరిజనుల వ్యవసాయ భూమిని ఆక్రమంగా ప్రభుత్వం ఫార్మసిటీ పేరుతో లాక్కొని దౌర్జన్యంగా కేసు పెట్టి జైలు పాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి త్వరలో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. గిరిజలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తన సొంత కుటుంబ సభ్యుల కోసం గిరిజనులను వేధించడం మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు జాదవ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, ఫ్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, పరశురాం, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

భూ దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న సమితి సభ్యులు

ఆదిలాబాద్: జైనథ్ మండలం మాండగడ గ్రామంలో నిర్మించనున్న శ్రీ మురళీకృష్ణ దేవాలయానికి ఆరు గుంటల భూమిని దానం చేసిన గ్రామానికి చెందిన ఠాకూర్ నర్సింగ్‌ను జిల్లా కేంద్రంలో సోమవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ దేవాలయానికి భూ దానం చేయడం గొప్ప విషయమన్నారు. దేవాలయాల అభివృద్ధికి వ్యాపారవేత్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు కొత్తపల్లి సంజీవ్, రావుల వేణు, నర్సింలు, మీసాల స్వామి, మురళీకృష్ణ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యనందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్యనందించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలన్నారు. ఇందు కోసం ప్రతీ గ్రామంలో ఆధునిక హాస్పిటల్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్హతల ప్రకారం ప్రజలకు ఉపాధిని కల్పించి ఆర్థిక స్థితిని మెరుగుపర్చాలన్నారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో కూడా ఎకరం వ్యవసాయ భూమి ఇవ్వాలన్నారు. 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లుని నిర్మించి ఇవ్వాలని కోరారు. ధర్మసమాజ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా ధర్మ కమిటీ సభ్యులు అన్నెల అడెల్లు, చీటి వెంకటేశ్, రాంచందర్, నవీన్, సాయికుమార్, విను కుమార్, ప్రజ్ఞాన్, అంజన్, రవి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

గ్రామసభ బహిష్కరణ



ఎజెండా అంశాలను చదివి వినిపిస్తున్న అధికారి

ఇచ్చోడ: మేజర్ పంచాయతీలో సోమవారం నిర్వహించిన గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. ఆదివాసీ సంఘాల అభ్యర్థన మేరకు పంచాయతీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్ అధ్యక్షతన గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీకి చెందిన మూడు గదులను ఆదివా సీలకు కేటాయించాలని వారు అభ్యర్థించారని, దీని పై గ్రామస్తులు అభిప్రాయం తెలపాలని కోరారు. పంచాయతీకి సంబంధించిన గదులను కేటాయించడంపై గ్రామస్తులు భిన్నాభిప్రాయాలు తెలియజేశారు. మాజీ సర్పంచ్ నారాయణ మాట్లాడుతూ ఒక సంఘానికి గదులు కేటాయించడం సరికాదని, గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

గ్రామాలభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం వర్ని నియోజకవర్గంలోని పార్వా, వగార, సావర్గ, సావంగి తదితర గ్రామాల్లో మాజీ మంత్రి శివాజీ మోగేతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పర్వా గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహారాష్ట్ర అభివృద్ధి పథంలో ముందుకువెళ్లాలంటే కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీజేపీ పార్టీని ఓటు అనే ఆయుధం ద్వారా భూస్థాపితం చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. బీజేపీ మాటల గారడి చేస్తోందని ఇప్పటి వరకు గ్రామాల్లో సరైన రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శివాజీ రావ్ మోగే, ఎస్టీ సెల్ చైర్మన్ మరప బాపురావ్, నాయకులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: మహారాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని బేల మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం రాజురా నియోజకవర్గంలోని కోర్పన గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి సుభాష్ దోటేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, బేల మండల అధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాక్లే, జైనథ్ మార్కెట్ వైస్ చైర్మన్ విలాస్ పటేల్, చంద్రకాంత్, రూప్‌రావు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమేశ్

ఎదులాపురం: భాషెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్ర ప్రారంభోత్సవ సభను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో సోమవారం జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 28న నిర్వహిస్తున్న ప్రారంభోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక పోరాటాల సారథి, ఐక్య ఉద్యమాలవారధి, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్న యూనియన్ జిల్లా కార్యాలయ ప్రారంభమనేది జిల్లా కార్మిక వర్గానికి పండుగలాంటిదన్నారు. ప్రజలు, కర్షకులు, ఆదివాసీలు, కార్మిక ఉద్యమ శ్రేయోభిలాషులు వేలాది సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, వెంకటమ్మ, శోభ, లింగాల చిన్నన్న, ముఖినేపల్లి గంగన్న, అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన ఇచ్చోడ విద్యార్థులు

ఇచ్చోడ: రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ఇచ్చోడ విద్యార్థులు సత్తా చాటారు. మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జ్ఞానేశ్వర్, సచిన్, శ్రీకాంత్, శేఖర్, సతీష్ లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 2వ బహుమతి అందుకున్నారు. ఇటీవల నిర్మల్ జిల్లాలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి కాంత్‌రావు విద్యార్థులను అభినందించారు.

20న జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మహిళల జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బుధవారం ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డుతో పోటీల కన్వీనర్ విటల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి అఖిల్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

పెయింటింగ్ పోటీలు

ఆదిలాబాద్: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 'అబ్దుల్ కలామ్' అనే అంశంపైన నిర్వహించిన పోటీలకు జిల్లా కేంద్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ శ్రీనివాస్, మాట్లాడుతూ ఈనెల 20న జరిగే ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఫర్వేజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం దేగామలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ముందు జాగ్రత్తగా గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మారుతి, దుర్గాజీ, పరమేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

క్రియాశీల సభ్యత్వం పొందాలి

నేరడిగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసే ఆశావాహులు 50 సాధారణ సభ్యత్వాలు నమోదు చేసి క్రియాశీల సభ్యత్వం పొందాలని అసెంబ్లీ కన్వీనర్ కదం బాబారావు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షుడు మాధవ్ రావ్ ఆమ్టేతో కలిసి హాజరయ్యారు. బీజేపీలో సంస్థాగతంగా ఎన్నికలు త్వరలో జరుగుతాయని, ఆ ఎన్నికలకు సంబంధించిన వర్క్‌షాప్‌ను ప్రతీ మండలంలో నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లే సంతోష్ సింగ్, తిత్రే నారాయణ్ సింగ్, గట్టు నారాయణ, చొక్కపల్లి రాములు, జాదవ్ పరుశురాం, తీగల నవీన్, మెరుగు శ్రీధర్ రెడ్డి, మందాడి కృష్ణ, లక్ష్మణ్, లింగంపల్లి సురేశ్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

ఎదులాపురం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అటవీ ప్రాంతంలోని ఆదివాసీ ప్రజలకు పులి బెడద నుంచి రక్షణ కల్పించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు పంట చేతికొచ్చిన సందర్భంలో కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్న సమయంలో పులి భయంతో మరింత నష్టం జరుగుతుందన్నారు. పంట పొలాలకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. తక్షణమే పులి జాడ కనుక్కొని ఆదివాసీలకు రక్షణ కల్పించాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ప్రోగెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు రామేశ్వర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి గుంటి ఎల్లయ్య, ఆత్రం భుజంగ్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొడ్డు రామేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మర్సుకోల జ్ఞానేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడిగా మెస్రం మారుతి, రాథోడ్ సాగర్, అర్క ఇందిరా, గంగాసాగర్, జాదవ్ గోపాల్, కార్యదర్శులుగా జితేందర్, పంద్ర జ్యోతిరాం, కైలాస్, గోద్రు, దుర్వ జంగులను ఎన్నుకున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఆదిలాబాద్‌రూరల్: పరిసరాలతో పాటు విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సెక్టోరల్ అధికారి జె.నారాయణ అన్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా సోమవారం అంకోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అన్నం తినే ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్, స్థానిక వైద్యాధికారి సర్ఫరాజ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

విద్యా సామర్థ్యాలు పెంపొందించాలి



మాట్లాడుతున్న ఏటీడీవో చవాన్ అమిత్

నేరడిగొండ: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏటీడీవో చవాన్ అమిత్ అన్నారు. సోమవారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. ముందుగా పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యా బోధన, విద్యార్థినుల సామర్థ్యాలతో పాటు పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉత్తంరావ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎఫ్‌సీ చైర్మన్‌కు సన్మానం

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా తగిన గుర్తింపు లభిస్తుందని తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఏ ఫహీమ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్‌లో పర్యటించిన ఆయన అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేస్తు స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, మంచికట్ల ఆశమ్మ, కిషన్, రామ్‌రెడ్డి, కొండూరి రవి పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తిని తీసుకురావాలి



పత్తిని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి

బోథ్: రైతులు నాణ్యమైన పత్తిని జిన్నింగ్ మిల్లుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సాయిదత్త, సాయిబాబా జిన్నింగ్ మిల్లులను సందర్శించారు. ఈ సందర్భంగా పత్తిని పరిశీలించారు. రైతులు పత్తిని దళారులకు అమ్ముకోవద్దని సూచించారు. ఆయన వెంట వెంట మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్, నాయకులు చంటి, తదితరులున్నారు.